



అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

అర్జీల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత

◆ అధికారులు బాధ్యత తీసుకోవాలి ◆ కలెక్టర్ పి.అరుణ్ బాబు

ప్రజాశక్తి-గోరంట్ల టౌన్

జగనన్నకు చెబుదాం కార్యక్రమం ద్వారా ప్రజలు అందించే అర్జీలకు సత్వర పరిష్కారం చూపేలా ఆయా శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అరుణ్‌బాబు సూచించారు. బుధవారం ఉదయం గోరంట్ల మండల కేంద్రంలోని కమ్యూనిటీ హాల్‌లో మండల స్థాయి జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని నిర్వహించారు. కలెక్టర్‌తో పాటు జిల్లా ఇన్‌ఛార్జి జాయింట్ కలెక్టర్ కార్తీక్, డిఆర్‌ఒ కొండయ్య, ఆర్డీవో భాగ్యరేఖ, డీఆర్డీఏ పీడీ నరసయ్య, డిపిఒ విజయ్ కుమార్ తదితరులు పాల్గొని ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్పందన అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని ప్రజలకు మరింత చేరువ చేయాలనే ఉద్ధేశంతో ప్రభుత్వం మండల స్థాయిలో జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు. బుధ, శుక్రవారం రెండు రోజుల పాటు ఈ కార్యక్రమాన్ని మండల కేంద్రాల్లో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో అందుకున్న విజ్ఞప్తులకు నాణ్యమైన పరిష్కారాలు అందించాలన్నారు. ఫిర్యాదులు పునరావతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజల నుండి వచ్చిన విజ్ఞప్తులను సకాలంలో విచారణ జరిపి సత్వర చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ రంగనాయకులు, ఎంపీడీవో రంగనాథ్‌గుప్తా, హౌసింగ్ పీడీ చంద్రమౌళి రెడ్డి, పీఆర్ ఎస్ఈ గోపాల్ రెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావుతో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

మరుగుదొడ్డే ఇల్లుగా మార్చుకుని..



మరుగుదొడ్డిని ఇంటిగా మార్చుకుని నివసిస్తున్న కుటుంబం

కోడూరుకు చెందిన సునీత భర్త అంజనేయులు దంపతులు. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. మూడేళ్ల క్రితం వీరికి ఇళ్లు మంజూరు అయినా ఇంటి పట్టాలు ఇంత వరకు ఇవ్వలేదు. వీరికి సొంతిళ్లు లేదు. ప్రభుత్వం మంజూరు చేసిన మరుగుదొడ్డికి ఆనుకుని కొంత గోడలను నిర్మాణం చేసుకుని దానిపై సిమెంట్ రేకులు వేసుకుని అందులోనే నివాసం ఉంటున్నారు. వీరు పిల్లలను ఇంట్లో పడుకోబెట్టి బయట నిద్రించాల్సిన పరిస్థితి ఉంది.

ఉన్న ఇంటిని కూల్చేశారు..



కూల్చివేసిన మొండి గోడకు పట్టకట్టుకుని జీవనం చేస్తున్న కుటుంబం

కోడూరుకు చెందిన చెన్నంపల్లి శివప్ప ఇల్లు ప్రభుత్వ పాఠశాల సమీపంలో ఉంది. నాడు-నేడు అభివద్ధి పనుల్లో భాగంగా ప్రహరీ నిర్మాణానికి అడ్డుగా వస్తుందన్న కారణంతో వీరి ఇంటిని కూల్చేశారు. ఇల్లు కూల్చేసే సమయంలో ప్రత్యామ్నాయంగా స్థలం ఇచ్చి, ఇంటి నిర్మాణం చేయిస్తామని అధికారులు, ప్రజాప్రతినిధులు హామీ ఇచ్చారు. ఇప్పటికీ వీరికి ఇల్లు మంజూరు చేయలేదు. కూల్చేసిన గోడలకు పట్టను అడ్డుగా పెట్టుకుని నాలుగేళ్లుగా వీరు జీవనం సాగిస్తున్నారు.

ఒకే ఇంట్లో పది మంది...



సెంటు ఇంట్లో ఉంటున్న మూడు కుటుంబాల సభ్యులు

కోడూరుకు చెందిన నవరత్నమ్మ భర్త ఆదినారాయణ ఇంటి పెద్దలుగా ఉన్న ఉమ్మడి కుటుంబం. సెంటు స్థలంలో నిర్మించిన ఇంట్లో మూడు కుటుంబాలు, పది మంది సభ్యులు నివాసం ఉంటున్నారు. అత్యంత ఇరుకుగా ఉన్న ఒకే ఇంట్లో ఇంత మంది జీవనం సాగిస్తున్నారు. పిల్లలను ఇంట్లో పడుకోబెట్టి పెద్దలందరూ ఇంటి ముందు నిద్రిస్తున్నారు. కనీసం నీటి బిందెలు పెట్టుకోవడానికి కూడా ఇంట్లో స్థలం లేని దుస్థితి ఉంది. వర్షం వస్తే వీరి ఇబ్బందులు వర్ణనాతీతం

20 ఏళ్లుగా అద్దె ఇంట్లోనే...



20 ఏళ్లుగా బాడుగ ఇంట్లో ఉంటున్న షభీన తాజ్ రహంతుల్లా దంపతులు

చిలమత్తూరుకు చెందిన షబీనా తాజ్, భర్త రహంతుల్లాలకు వివాహం అయ్యి 20 సంవత్సరాలు అవుతోంది. వీరికి సొంతిళ్లు లేదు. 20 ఏళ్లుగా బాడుగ ఇంట్లోనే నివసిస్తున్నారు. అప్పటి నుంచి వీరు అనేకసార్లు ఇంటి స్థలం కోసం అధికారులకు అర్జీలను ఇచ్చారు. ప్రస్తుత వైసిపి ప్రభుత్వంలోనూ అర్జీలను ఇచ్చారు. మూడేళ్ల క్రితం కోడూరు మద్దప్పల్లి వద్ద జగనన్న లే అవుట్ లో ప్రభుత్వం స్థలం కేటాయించింది. కోర్టు వివాదం నేపథ్యంలో ఆ స్థలం పంపిణీ ఆగిపోయింది.

ఇంకెన్నాళ్లు ఓపిక 'పట్టా'లి..!



◆ పేదల సొంతింటి కలకు సంకెళ్లు
◆ మూడేళ్లుగా కోర్టు పరిధిలో సమస్య
◆ గూడు కోసం పేదల భూస్వాధీన పోరాటం

ప్రభుత్వాలు మారుతున్నా పేదల సొంతింటి కల నెరవేరడం లేదు. ఏళ్ల తరబడి బాడుగ ఇళ్లలోనే కుటుంబం మొత్తం జీవనం సాగించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పేదలందరికీ ఇళ్ల పట్టాలు ఇస్తామని గొప్పలు చెప్పిన పాలకులు ఆచరణలో దానిని నిజం చేయలేకపోయారు. చిలమత్తూరులో ఇప్పటికీ పేదలు సొంతింటి కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. పట్టాలు ఇచ్చినంటే ఇచ్చి కోర్టు కేసుల పేరుతో వెనక్కు తీసేసుకున్నారు. ఇలా దాదాపు మూడేళ్లుగా పేదలు ఇళ్ల స్థలాల కోసం అధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారు. చిలమత్తూరు మండలం కోడూరు పంచాయతీ ముద్దప్పల్లిలో ఏర్పాటు చేసిన లేఅవుట్‌లో మొత్తం 250 పట్టాలు ఇచ్చేందుకు ఏర్పాట్లు చేశారు. ఇందులో చిలమత్తూరు మండల కేంద్రం, కోడూరు పంచాయతీకి చెందిన సుమారు 160 మంది లబ్ధిదారులను ఎంపిక చేశారు. కోర్టు వివాదం నేపథ్యంలో ఇప్పటికీ వీరికి పట్టాలు ఇవ్వలేదు. ఇళ్ల స్థలాల కోసం ఇంకెన్నాళ్లు ఓపిక'పట్టా'లని ఆవేదన వ్యక్తం చేస్తూ పేదలు గత వారంలో భూ స్వాధీన పోరాటం నిర్వహించారు.

ప్రజాశక్తి-చిలమత్తూరు

చిలమత్తూరు మండలం ముద్దప్పల్లిలో 411 సర్వే నెంబర్లో పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని ఉద్దేశంతో 2020లో లేఅవుట్ వేశారు. 250 స్థలాలను సిద్ధం చేశారు. ఇందు కోసం 160 మంది లబ్ధిదారులన ఎంపిక చేసి, జియోట్యాగ్ కూడా పూర్తి చేశారు. తీరా పట్టాలు ఇచ్చే సమయానికి ఆ భూమి తమదంటూ ఓ వ్యక్తి కోర్టుకు వెళ్లాడు. దీంతో ఇళ్ల పట్టాల పంపిణీ ఆగిపోయింది. ఇది జరగక ముందే 165 మంది కోసం కొడికొండ చెక్‌పోస్టు వద్ద భూమిని చదును చేసి అక్కడ ఇళ్ల స్థలాలు ఇస్తామని అధికారులు చెప్పారు. భూమి అంతా చదును చేసిన తర్వాత దానిని ఎమ్‌ఐజి లేవుట్ కింద ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. మరోసారి లాలేపల్లి అంజనేయ స్వామి దేవాలయం సమీపంలో జాతీయ రహదారి పక్కన 805 సర్వే నెంబర్‌లో 160 మంది కోసం భూమిని చదును చేసి రాళ్లు పాతి, ప్లాట్‌లుగా ఏర్పాటు చేశారు. అక్కడ కూడా భూమి విలువ ఎక్కువ అని ప్లాట్‌లు వేసి అమ్మితే ప్రభుత్వానికి ఆదాయం సమకూరుందని ఆలోచనతో ప్రభుత్వ అవసరాలకోసం రిజర్వ్ చేస్తున్నామని చెప్పి పట్టాల పంపిణీని ఆపేశారు. అనంతరం 411 సర్వే నెంబర్‌లో పట్టాల పంపిణీకి ఏర్పాట్లు చేశారు. ఈ స్థలం కోర్టు వివాదాల్లో ఉందని తెలిసి కూడా జగనన్న కాలనీ ఏర్పాటు చేశారు. ఈ స్థలంలో పట్టాలు ఇచ్చేందుకు లబ్ధిదారుల ఎంపిక జరిగిన మూడేళ్లు దాటినా సమస్య పరిష్కారం కాలేదు.



సర్వే నెంబర్ 805లో సిపిఎం నాయకులతో కలిసి భూస్వాధీన పోరాటం చేస్తున్న పేదలు (ఫైల్ పోటో)

సిపిఎం అధ్వర్యంలో భూ స్వాధీన పోరాటం

ఇళ్ల పట్టాల కోసం మూడేళ్లుగా ఎదురుచూసిన పేదలు విసిగిపోయారు. అధికారులపై నమ్మకం లేక సిపిఎం ఆధ్వర్యంలో భూస్వాధీన పోరాటం చేపట్టారు. ఇళ్ల పట్టాలకు నివాసయోగ్యమైన ప్రాంతంగా గుర్తించిన 805లో ఇళ్ల స్థలాలు ఏర్పాటు చేసి నిర్మాణాలు కట్టించాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో గత వారంలో చేపట్టారు. ఇందుకు స్పందించిన అధికారులు ఈ నెల 21వ తేదీ తర్వాత పేదలకు పట్టాలు ఇస్తామని హామీ ఇచ్చి ఆందోళనను విరమింపజేశారు. అధికారులు ఇచ్చిన హామీ మేరకు ఈ రోజు గురువారం నాడు పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాల్సి ఉంది.

ఇళ్ల పట్టాలు ఇవాల్సిందే..

ఇళ్ల స్థలాలు లేక ఇబ్బందులు పడుతున్న పేదల సమస్యలపై అధికారులు స్పందించాలి. భూ స్వాధీన పోరాటం సందర్భంగా ఈ నెల 21వ తేదీన పేదలందరికీ ఇళ్ల పట్టాలు ఇస్తామని పోలీసులు, మీడియా సమక్షంలో తహశీల్దార్ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి. అధికారులు స్పందించి ఇళ్ల స్థలాలు ఇవ్వకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం. వారి నుంచి స్పందన లేకుంటే తామే పేదలతో కలిసి 805 సర్వే నెంబర్‌లో పునాదులు తీసుకుంటాం.

ప్రవీణ్‌కుమార్, వ్యకాసం జిల్లా అధ్యక్షుడు.

నేడు యుటిఎఫ్ స్వర్ణోత్సవాల ర్యాలీ

హిందూపురం నుంచి ప్రారంభం

ప్రజాశక్తి- హిందూపురం

ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) ఆవిర్భవించి 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా యుటిఎఫ్ సర్ణోత్సవాలు తెలియజేస్తూ బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు యుటిఎఫ్ శ్రీసత్యసాయి జిల్లా, అనంతపురం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.జయచంద్రారెడ్డి, కె.నాగేంద్ర, లింగమయ్య, గోవిందరాజులు తెలిపారు. బుధవారం వారు మాట్లాడుతూ యుటిఎఫ్ 1974వ సంవత్సరంలో స్థాపించబడిందన్నారు. 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా ర్యాలీ చేపట్టి యుటిఎఫ్ ఆశయాలు సాధించిన లక్ష్యాలు, సాధించుకోవాల్సిన అంశాలపై రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధ్యాయులు, ప్రజలకు తెలియజేస్తూ బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శ్రీసత్యసాయి జిల్లాలో హిందూపురం నుంచి చేపడుతున్న యుటిఎఫ్ సర్ణోత్సవాల బైక్ ర్యాలీకి యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు నక్కా వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా హాజరై ర్యాలీ ప్రారంభిస్తారని తెలిపారు. ఆయనతో పాటు యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కోటేశ్వరప్పతో, ఉమ్మడి జిల్లాల నాయకులు, కార్యకర్తలు పాల్గొంటారని తెలిపారు. ర్యాలీ హిందూపురంలో ప్రారంభమయ్యే బైక్ ర్యాలీ పెనుకొండ, రాప్తాడు, మీదుగా అనంతపురం నగరంలోకి ప్రవేశిస్తుందన్నారు. పంగల్ రోడ్, కలెక్టరేట్, సప్తగిరి సర్కిల్, శ్రీకంఠం సర్కిల్, టవర్‌క్లాక్, బళ్ళారి బైపాస్ మీదుగా ఉరవకొండ, గుంతకల్ చేరుకుంటుందన్నారు. అక్కడి నుంచి కర్నూలు జిల్లా పత్తికొండలో ప్రవేశిస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు సమస్యగా ఉన్న సిపిఎస్ రద్దు చేయాలనే డిమాండ్‌ను రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు ర్యాలీ చేపడుతున్నట్లు తెలిపారు. పాత పెన్షన్ విధానం అమలు చేసేంత వరకు శాంతియుతంగా కలిసి వచ్చే ప్రతి కార్యక్రమంలోనూ ఈ డిమాండ్‌తో నిరసన తెలియజేయనున్నట్లు తెలిపారు.

పెంచిన విద్యుత్ ఛార్జీలను తగ్గించాలి

ప్రజాశక్తి-హిందూపురం

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పెంచిన విద్యుత్ ఛార్జీలకు వ్యతిరేకంగా ఐక్య పోరాటాలకు సిద్ధం అవుతున్నట్లు రాజకీయ పార్టీల ఐక్యవేదిక నాయకులు తెలిపారు. బుధవారం పట్టణంలోని ఆర్‌సిపి కార్యాలయంలో రాజకీయ పార్టీల ఐక్యవేదిక ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి కాంగ్రెస్ పార్టీ శ్యామ్ కిరణ్, బిఎస్‌పి శ్రీరాములు, ఆర్‌సిపి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు ఆరు రకాల పేరుతో విద్యుత్ చార్జీలను పెంచారన్నారు. ఇలా ప్రజలపై అనేక రూపాలలో భారాలు మోపడం తగదన్నారు. విద్యుత్‌చార్జీల పెంపునకు వ్యతిరేకంగా రాజకీయ పార్టీల ఐక్యవేదిక కార్యచరణ రూపొందించిందన్నారు. ముందుగా తహశీల్దార్ కార్యాలయంలో వినతి, సంతకాల సేకరణ, విద్యుత్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని రౌండ్ టేబుల్ సమావేశంలో తీర్మానించామని ఈ కార్యక్రమాలను త్వరలో ప్రారంభిస్తామని అన్నారు. ప్రజలు, ప్రజాసంఘాల వారు నిరసన కార్యక్రమాలకు మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు రవికుమార్, కలీం, హరి, హనుమంతరాయుడు, గంగప్ప, వెంకటేశులు, అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికులకు సౌకర్యాలు కల్పించండి

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం రైల్వే స్టేషన్‌లో ప్రయాణికులకు తగిన సౌకర్యాలు కల్పించాలని రైల్వే ఎడిఎన్‌ను ప్రజా సంఘాల నాయకులు కోరారు. ఈ మేరకు వారు బుధవారం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎడిఎన్‌కు సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు పార్లమెంట్ కేంద్రమైన హిందూపురం రైల్వే స్టేషన్‌లో ప్రయాణికులకు కనీస సౌకర్యాలు లేవన్నారు. స్టేషన్‌లో ఏర్పాటు చేస్తున్న ఫుట్ ఓవర్ బ్రిడ్జి మూలన కాకుండా మధ్యలో ఏర్పాటు చేయాలన్నారు. దీంతో పాటు వృద్ధులకు, వికలాంగులకు సౌకర్యం కోసం లిఫ్ట్, ర్యాంపు ఏర్పాటు చేయాలన్నారు. స్టేషన్‌లో ప్రయాణికుల కోసం నిర్మాణం చేసిన గదులను, మరుగుదొడ్లను నిత్యం తెరచి ఉంచాలన్నారు. దీనిపై స్పందించిన ఎడిఎన్ హిందూపురం రైల్వే స్టేషన్ అమృత్ స్టేషన్ కు ఎంపిక అయిందని, రూ. 15కోట్లు ప్రత్యేక నిధులు మంజూరు అవుతున్నాయని, ఈ నిధులతో అన్ని సౌకర్యాలు కల్పిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు చైతన్య గంగి రెడ్డి, ఉదయ్ కుమార్, క్రిష్టా నాయక్, ప్రసాద్, తిప్పేస్వామి, సునిల్ తదితరులు పాల్గొన్నారు.

వినాయక నిమజ్జనానికి ఏర్పాట్లు

ప్రజాశక్తి కదిరి అర్బన్

వినాయక విగ్రహాల నిమజ్జన కార్యక్రమాన్ని శాంతియుత వాతావరణంలో నిర్వహించాలని ఎస్పీ మాధవరెడ్డి సూచించారు. బుధవారం స్థానిక తాయి గ్రాండ్ లో వినాయక శోభాయాత్ర శాంతి సమావేశాన్ని నిర్వహించారు. డీఎస్పీ శ్రీలత అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో ఎస్పీతో పాటు ఆర్డీవో రాఘవ, మున్సిపల్ కమిషనర్ శ్రీహరిబాబు, మాజీ ఎంపీ కల్నల్ నిజాముద్దీన్, మాజీ మంత్రి షాకీర్, మాజీ ఎమ్మెల్యే ఎంఎస్ పార్ధసారథి, ఆలయ కమిటీ చైర్మన్ గోపాలక్రిష్ణ, ముస్లిం మతపెద్దలు పాల్గొన్నారు. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఈనెల 22న నిర్వహించే వినాయక విగ్రహాల నిమజ్జనం శాంతియుత వాతావరణంలో నిర్వహించాలని సూచించారు.

జిల్లాలో 37 వేల దొంగఓట్ల తొలగింపు

పుట్టపర్తి అర్బన్ : జిల్లాలో ఓటర్ సర్వేలో 37వేల బినామీ ఓట్లను తొలగించామని కలెక్టర్ అరుణ్ బాబు పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రాజకీయ ప్రతినిధులు మాట్లాడుతూ రాష్ట్రంలో 27 లక్షల దొంగ ఓట్లు నమోదు అయినట్లు మీడియాలో వార్తలు వస్తున్నాయన్నారు. జిల్లాలో ఎన్ని తొలగించారని ప్రస్తావించగా కలెక్టర్ స్పందిస్తూ 37వేల బినామీ ఓట్లను తొలగించామన్నారు. అసౌకర్యంగా ఉన్న పోలింగ్ కేంద్రాల గురించి తెలిపితే పరిశీలిస్తామని కలెక్టర్ తెలిపారు. కొత్త పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయాలంటే కనీసం 1500 ఓటర్లు ఉండాలన్నారు. పోలింగ్ కేంద్రాలలో అసౌకర్యం ఉంటే ప్రతినిధులు తెలపాలని కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కార్తీక్, డిఆర్‌ఒకొండయ్య, సిపిఎం ఇంతియాజ్, సిపిఐ వేమయ్య యాదవ్, జనసేన అబ్దుల్లా, వైసీపీ రంగారెడ్డి, టిడిపి రామాంజనేయులు, బిఎస్‌పి రాయుడుతో పాటు ఆర్డీవోలు భాగ్య రేఖ, రాఘవేంద్ర, చిన్నయ్య, డిప్యూటీ ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

మెస్‌ఛార్జీలు పెంచాలి : ఎస్ఎఫ్ఐ

హిందూపురం : పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ప్రభుత్వ వసతిగృహ విద్యార్థులకు ఇస్తున్న మెస్, కాస్మోటిక్ ఛార్జీలను ప్రభుత్వం పెంచాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బాబావలి డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని బిసి వసతిగృహం వద్ద విద్యార్థులతో కలిసి విలేకరులతో బాబావలి మాట్లాడారు. ప్రభుత్వం నాడు-నేడు కార్యక్రమంతో పాఠశాల, వసతిగృహాల రూపు రేఖలు మార్చామని గొప్పలు చెబుతోందన్నారు. అయితే క్షేత్ర స్థాయిలో పరిశీలన చేస్తే గత సంవత్సరం ప్రారంభించిన నాడు-నేడు పనులు ఇంత వరకు పూర్తి కాలేదన్నారు. విద్యార్థులకు ఇస్తున్న మెస్, కాస్మోటిక్ చార్జీలు గత నాలుగు నెలల నుంచి ఇవ్వలేదన్నారు. వీటిని వెంటనే విడుదల చేయాలని లేని పక్షంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పెద్ద ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఎస్ఎఫ్ఐ నాయకులు చంద్రశేఖర్, రంగనాథ్, బాబా ఫక్రుద్దీన్, గురునాథ్, వీరేష్, హర్ష, విజయ్‌తో పాటు వసతి గృహ విద్యార్థులు పాల్గొన్నారు.

తానా సమ్మేళనానికి పుట్టపర్తి వాసి

పుట్టపర్తి అర్బన్ : తానా అంతర్జాతీయ కవయిత్రుల సమ్మేళనానికి పుట్టపర్తికి చెందిన కుమారి దొడ్డపనేని శ్రీవిద్య ముఖ్యఅతిథిగా పాల్గొననున్నారు. ఈ మేరకు ఆమెకు బుధవారం ఆహ్వానం అందింది. ఉత్తర అమెరికా తెలుగు సంఘం (తానా) ప్రపంచ సాహిత్య వేదిక ఈనెల 24న ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న నారీ సాహిత్య భేరి శతాధి కావయిత్రిల సమ్మేళ కార్యక్రమానికి పుట్టపర్తికి చెందిన రచయిత్రి దొడ్డపనేని శ్రీవిద్యను ప్రత్యేక అతిథిగా ఆహ్వానించారు. గత 20 ఏళ్ల క్రితం విజయవాడ నుంచి పుట్టపర్తికి వచ్చిన శ్రీవిద్య కుటుంబం ఇక్కడే స్థిరపడింది. వివిధ సంస్థలలో కవితలు, రచనలు చేస్తున్న ఈమెను తానా ఆహ్వానించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఒక్క రచనలకే పరిమితం కాకుండా ఆమె అనేక రకాలుగా పేదలకు తన వంతు సేవలు అందిస్తున్నారు. 14 గంటలపాటు జరిగే సాహిత్య సమ్మేళనానికి తనకు అవకాశం కల్పించిన తానా అధ్యక్షులు నిరంజన్, నిర్వాహకులు డాక్టర్ తోటకూర ప్రసాద్, సమన్వయకర్త చిగురుమళ్ళ శ్రీనివాస్‌కు ఆమె ధన్యవాదాలు తెలిపారు.

దొరిగల్లులో విషాదం

◆ వినాయక చవితి వేడుకల్లో రెండు వర్గాల మధ్య ఘర్షణ
◆ దాడిలో వ్యక్తి మృతి
◆ 20 మందికి గాయాలు



దాడిలో మృతి చెందిన అనంతయ్య (ఫైల్ ఫొటో)

ప్రజాశక్తి-ముదిగుబ్బ

మండల పరిధిలోని దొరిగల్లు బీసీ కాలనీలో వినాయక చవితి వేడుకల్లో విషాదం చోటు చేసుకుంది. రెండు వర్గాల మధ్య మొదలైన ఘర్షణ ఓ వ్యక్తి మృతికి దారి తీసింది. ఇందుకు సంబంధించి పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి... దొరిగల్లు బీసీ కాలనీలో వినాయక చవితిని పురస్కరించుకుని వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. మంగళవారం రాత్రి 1 గంట సమయంలో దొరిగల్లు గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు వినాయక మండపం వద్దకెళ్లి రెండు ద్విచక్ర వాహనాల సైడ్ స్టాండ్‌ను సిమెంట్ రోడ్డుకు తాకిస్తూ నిప్పులు చిమ్మేలా విన్యాసం చేశారు. అక్కడే ఉన్న దొరిగల్లు బీసీ కాలనీకి చెందిన కొందరు ఆయువకుల్ని మందలించారు. అక్కడి నుంచి వెళ్లిపోయిన యువకులు వేణు, వంశీ, పవన్, సింహాద్రిలను వెంటబెట్టుకుని మళ్లీ వినాయక మండపం వద్దకు వచ్చారు. ఈ సమయంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ మొదలైంది. ఈ ఘర్షణలో మంజుల అనంతయ్య(55)తో పాటు పలువురిపై కర్రలతో దాడి యువకులు దాడి చేశారు. ఈ ఘటనలో అనంతయ్య తలకు తీవ్రంగా గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనలో ఇరు వర్గాలకు చెందిన దాదాపు 20 మంది వరకు గాయపడ్డారు. ఘర్షణ విషయం తెలుసుకున్న ముదిగుబ్బ టౌన్ సిఐ హేమంత్ కుమార్ సిబ్బందితో కలిసి హుటాహుటిన దొరిగల్లు గ్రామానికి చేరుకున్నాడు. అక్కడ పరిస్థితిని చక్కదిద్ది, గాయాల పాలైన వారిని చికిత్స నిమిత్తం ముదిగుబ్బ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఇందులో నలుగురికి గాయాలు తీవ్రంగా ఉండడంతో వారిని మెరుగైన వైద్యం కోసం కదిరికి తరలించారు. మతుడు అనంతయ్య భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ తెలిపారు. బుధవారం ఉదయం ఘటనా స్థలాన్ని అడిషనల్ ఎస్పీ విష్ణు, డీఎస్పీ శ్రీనివాసులు, సిఐ యతీంద్రలు పరిశీలించారు. కాగ ఈ ఘటనకు సంబంధించి 13 మందిని అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

వినాయక నిమజ్జనంలో అపశృతి

నీటికుంటలో పడి యువకుడి మృతి

ప్రజాశక్తి బత్తలపల్లి

మండలంలోని ఈదుల ముష్టూరు గ్రామంలో వినాయక నిమజ్జనంలో ఆపశృతి చోటు చేసుకుంది. నీటి కుంటలో పడి బాలిగొండ విజయ్ (18) అనే యువకుడు మృతి చెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాలు...ఈదుల ముష్టూరు గ్రామానికి చెందిన బొలిగొండ లక్ష్మన్న, లింగమ్మ దంపతుల కుమారుడు విజయ్ వినాయక చవితి పండుగను పురష్కరించుకుని గ్రామంలో స్నేహితులతో కలిసి వినాయకుని విగ్రహం ఏర్పాటు చేశారు. మూడు రోజులు పాటు స్నేహితులతో కలిసి సందడి చేసుకున్నారు. బుధవారం సాయంత్రం వినాయకుని విగ్రహాన్ని ఊరేగింపుగా గ్రామ సమీపంలోని చెరువు వద్దకు తీసుకువెళ్లారు. అక్కడ చెరువు కుంటలో వినాయకుని విగ్రహం నిమజ్జనం చేస్తుండగా అదుపు తప్పి విజయ్ కుంటలో పడిపోయాడు. బురదలో ఇరుక్కుపోవడంతో ఊపిరి ఆడక మృతి చెందాడు. స్నేహితులు రక్షించేందుకు చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. మృతుడు అనంతపురంలోని ఓ ప్రవేట్ కళాశాలలో ఇంటర్ చదువుకుంటున్నాడు. ఉన్న ఒక్కగానొక కుమారుడు మృత్యువాత పడడంతో మృతుని తల్లిదండ్రులు రోదనలు చూపరులను కంటతడి పెట్టించాయి. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించండి

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

జిల్లాలో ఎస్సీ, ఎస్టీ ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలని దళిత ఇండియన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ (డిక్కీ) రాయలసీమ జోనల్ అధ్యక్షులు కోలా వెంకటరమణ కోరారు. ఈ మేరకు ఆయన బుధవారం స్థానిక కలెక్టరేట్ లో కలెక్టర్‌ను కలిసి నూతన జిల్లా అభివృద్ధికి డిక్కీ తరపున కలెక్టర్ కు లక్ష రూపాయలు విరాళాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఔత్సాహిక ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తల కొరకు అనేక పథకాలు అమలు చేస్తున్నాయని అన్నారు. అయితే చాలా పథకాలు ఈ వర్గాలకు అందడం లేదని చెప్పారు. పూచీకత్తు లేని రుణ సదుపాయం బ్యాంకర్లు అందించడం లేదన్నారు. స్థిరాస్తులు తనఖా పెడితే తప్ప రుణాలు ఇవ్వడం లేదన్నారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించి తీర్చిదిద్దడానికి తమ సంస్థ (డిక్కీ) హ్యాండ్ హోల్డింగ్ సర్వీసును అందిస్తోందన్నారు. జిల్లా ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తల కొరకు ప్రత్యేక రుణమేళా శిబిరాలు నిర్వహించాలని ముఖ్యంగా వెనుకబడిన కదిరి, మడకశిర, పుట్టపర్తి ప్రాంతాలలో నిర్వహించాలని కలెక్టర్‌ను కోరారు. తగు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చారు. లక్ష రూపాయలు విరాళం ఇచ్చినందుకు కలెక్టరు కోలా వెంకటరమణను అభినందించారు.

అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయాలి

కదిరి టౌన్ : అగ్రిగోల్డ్ బాధితులకు గత ఎన్నికలలో ఇచ్చిన హామీలను నెరవేర్చి ఆదుకోవాలని బాధితులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు బుధవారం స్థానిక ఎమ్మెల్యే సిద్దారెడ్డిని కలిసి వినతి పత్రం సమర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ యాజమాన్యపు మాటలు నమ్మిన ఎందరో నిరుద్యోగులు, యువత, గృహిణులు ఏజెంట్లుగా విధుల్లో చేరి తమ స్వంత డబ్బులతో పాటు, వారి స్నేహితులు,బంధువులు, ప్రజలతో వేలాది కోట్ల రూపాయలను అగ్రిగోల్డ్ కంపెనీలో డిపాజిట్లు చేయించారన్నారు. కంపెనీ బోర్డు తిప్పేసిన తర్వాత డిపాజిట్ చేసిన ఖాతాదారుల ఒత్తిడి తట్టుకోలేక అనేక మంది ఆత్మహత్య చేసుకున్నారన్నారు. ఈనేపథ్యంలో బాధితులను ఆదుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు అత్తార్ మహబూబ్ బాషా, ఏజెంట్లు, ఖాతాదారులు దాదాపీర్, ఫక్రుద్దీన్, ఆనంద బాబు, మౌజన్ మాబ్బాషా, ఉత్తన్న, ఇర్ఫాన్, సత్యనారాయణ, ఖాదర్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

స్పీడ్‌బ్రేకర్లు ఏర్పాటు చేయాలి

తనకల్లు : మండల పరిధిలోని కొక్కంటి క్రాస్ లో నిత్యం రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో ప్రమాదాల నివారణకు రద్దీగా ఉండే సర్కిళ్లలో వేగ నిరోధకాలు వేయాలని టిడిపి నాయకులు డిమాండ్ చేశారు. వేగనిరోధకములు వేయడం వలన ప్రమాదాలను నివారించవచ్చునని అన్నారు. ఇప్పటికే ఎన్నో ప్రమాదాలు జరిగి చాలామంది ప్రాణాలు కోల్పోయారని, ఇప్పటికైనా పోలీసులు స్పందించి వేగనిరోధకములు ఏర్పాటు చేసి ప్రజలను ప్రాణాల నుంచి కాపాడాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ రెడ్డి శేఖర్ రెడ్డి, మాజీ కన్వీనర్లు శంకర్ నాయుడు, రాజారెడ్డి, తెలుగు యువత మండల అధ్యక్షులు కావడి ప్రవీణ్ కుమార్, బాలసముద్రం జనసేన ఎంపీటీసీ అమర్ కార్తికేయ, క్లస్టర్ ఇన్‌చార్జి పిజి మల్లికార్జున, నాగభూషణ, తాజుఖాన్, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారం

అమరాపురం : మండల పరిధిలోని ఉదుకూరులో రెండు నెలలుగా నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించారు. తాగునీటి పథకానికి సంబందించి బోరుమోటరు స్టార్టర్ మరమ్మతుకు గురవడంతో సమస్య నెలకొంది. స్థానిక సర్పంచి హనుమక్క శివలింగప్ప, పంచాయతీ కార్యదర్శి నరేష్ బాబు ఆధ్వర్యంలో కొత్త స్టార్టర్‌ను ఏర్పాటు చేశారు. దీంతో సమస్య పరిష్కారమైంది.

In the Court of the Prl. District Judge, Anantapuramu
T.R.CRLMP No: 05/2023

Between:-
K. Latha ...**Petitioner**
and
K. Kullai Naik and Another ...**Respondents**

Notice to Respondent No. 1

R1 : K. Kullai Naik S/o. Kullayappa, Brahnapalli Thanda Village, Puttaparthy Mandalam. Sri Sathya Sai Dist.

పై నెంబరు కేసులో 1వ రెస్పాండెంటు అయిన మీ హాజరు నిమిత్తం 03-10-2023 వ తేదీ ఉదయం 10:30 గంటలకు వాయిదా వేసినారు. ఆ రోజు మీరు స్వతహాగా గానీ లేక వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమైన ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనియెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించెదరు.

(కోర్టు ఉత్తర్వుల మేరకు)

G. Padmaja, Advocate,
Anantapuramu. Cell: 81211 71108

In the Court of the Senior Civil Judge, Penukonda
E.P. 8/2023 O.S.92/2018

Between:-
B.S. Sivappa ...**Petitioner-D.Hr**
and
V. Kristappa ...**Respondent-J.Dr.**

Notice to Respondent

To: **V.** క్రిష్టప్ప **S/o. V.** శిద్దప్ప. వయస్సు 55 సంIIలు. హిందూ. వ్యవసాయదారుడు ఆనందాపురం **H/O** బ్రహ్మసముద్రము, సోమందేపల్లి మండలం
ఇందుమూలముగా నీకు తెలియజేయునది ఏమనగా **B.S.** శివప్ప **S/o. B.S.** సంజీవప్ప **D.No.5/332** శ్రీరాములయ్య కాలనీ, పెనుకొండ వారు వేసిన వ్యాజ్యము **EP8/2023 O.S. 92/2018 3-10-2023**వ తేదీన వాయిదా వున్నది. పై తేదీన నీవు ఖుద్దున గాని లేక వకీలు ద్వారా కానీ పై కోర్టు యెదుట ఉదయము 10-30 గంIIలకు హాజరు కావలయును. అట్లు నీవు హాజరు కాని యెడల పై వ్యాజ్యము నీ పరోక్షమున తీర్మానించబడునని తెలియచేయడమైనది.

(కోర్టు ఉత్తర్వుల మేరకు)

జి.మల్లిరెడ్డి
వాదిపరము వకీలు

In the Court of the Prl. District Judge, Anantapur.
G.W.OP. 61/2023
(In the matter of Permission to sell the property of the minors G. Nithya Sahasra and G. Palguna)

Between:-
G. Mallikarjuna S/o.G. Aswarthappa, Aged 34yrs. Residing at Mandalapalli (V) Bayanakuntapalle, Anantapuram Dist. ...**Petitioner**
and
Nill ...**Respondent**

ప్రకటన

పై తెలిపిన కోర్టు నందు పిటిషనర్ దాఖలు చేసిన G.W.OP 61/2023 అర్జీ మేరకు పిటిషనర్ భార్య అయిన బి. అరుణ పేరిట వారి అమ్మ బి. వెంకటలక్ష్మమ్మ వ్రాసి వీలునామ మేరకు ఎ-షెడ్యూలు దాఖలా ఆస్థి ఆమె తదనంతరము చెందునని వ్రాయడం అయినది. అయితే బి. అరుణ 23-11-2022 మరణించుట వలన ఆమె భర్త పిటిషర్ జి. మల్లికార్జున పై తెల్పిన కోర్టునందు మైనర్స్‌కు ఇరువురి చదువులకు అగు ఖర్చుల మేరకు క్రింద కనబరచి అమ్ముటకు కోర్టువారి పర్మిషన్ కొరకు దాఖలు చేసుకున్న అర్జీమేరకు కోర్టువారు తెలిపిన వాయిదా తేది ఈనెల 27-09-2023 ఉదయం 10:30. ఎవరికైన అభ్యంతరాలు వున్న యెడల వారు ప్రత్యక్షంగా కాని వకీలు ద్వారా కాని హాజరు అయి వారి ఆక్షేపణలు తెలుపగలరు. అట్లు ఆ దినం హాజరు కాని యెడల పిటిషనర్ దాఖలు చేసిన అర్జీ మేరకు తీర్మానింతురు అని తెలపడం అయినది.

SHEDULE

Property situated within RD & SRD of Hindupur and within the limits of Sreekantapuram village fields of Poolakunta grama panchayat area.

Babu	Part	Sy. No.	Extent	Plot Nos.	D.No.
Govt. Dry	1	481-1	Ac.3-86 cents {paiki	01	5-1-4/42-6
Govt. Dry	1	481-2	Ac.2-86 cents}		

Measuring : 80.55 Sq.yards
East-West: 20feet or 6.096 Hs.
North-South: On Eastern side : 37 Feet or 11.277Mtrs
North-South: On Western side : 35.5Feet or 10.820 Mtrs.
Paiki house constructed Ground Floor + First Floor
Measuring: East - West: 20 feet;
North-South: Eastern side: 22.3 feet;
North-South: Western side: 28 feet
Total constructed area 503 Sq. feet and First Floor 503 Sq.feet.

Bounded by:
East: 'B' schedule property allotted to Boya Koushal
West: House of Sreerama Reddy;
North: Municipality Park;
South: 20 feet road.

(కోర్టు ఉత్తర్వుల మేరకు)

యం. సుధాకర్, పిటీషనర్ తరుపు అడ్వకేట్,
అనంతపురము. సెల్ : 9959014416

ఒపిఎస్‌ను పునరుద్ధరించాలి : యుటిఎఫ్



సమావేశంలో పాల్గొన్న నాయకులు

ప్రజాశక్తి మడకశిర

ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరిచిన విధంగా పాత పెన్షన్ విధానాన్ని అమలుచేయాలని యుటిఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో యుటిఎఫ్ నాయకులు మాట్లాడుతూ ఉపాధ్యాయులతో చర్చలు జరపకుండా, సిపిఎస్ స్థానంలో జిపిఎస్‌ను మంత్రివర్గం ఆమోదించడం ఏమాత్రం సమంజసం కాదన్నారు. ఈ జిపిఎస్ విధానం కూడా ఉద్యోగ ఉపాధ్యాయులకు తీవ్రంగా నష్టపరిచే విధానమే అని అనారు. దీనిని ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ తీవ్రంగా వ్యతిరేకిస్తోందన్నారు. ప్రభుత్వం వెంటనే సిపిఎస్- జిపిఎస్ విధానాన్ని రద్దుచేసి ఎన్నికలలో ఇచ్చిన హామీ ప్రకారము పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈసమావేశంలో యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు భూతన్న, జిల్లా కార్యదర్శి తాహెర్ వలి, ఈశ్వర, సుదర్శన్, నరసింహమూర్తి, మాలింగప్ప, కదురప్ప, నంజన్న, వెంకటరమణ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

కదిరి టౌన్ : పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని యుటిఎఫ్ నాయకులు శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ 2019 ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు పాత పెన్షన్ విధానాన్ని అమలుపరచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కోశాధికారి డి. శ్రీనివాసులు, భార్గవ, సుధాకర్, నాగేంద్ర, ఆసిఫ్, ఫయాజ్, మధుసూదన్, రాజేష్, అల్లాబకాష్, గయాజ్ తదితరులు పాల్గొన్నారు.

విస్తారంగా రాగి పంటసాగు

ప్రజాశక్తి మడకశిర



రాగికంకులు కోస్తున్న మహిళలు

మండలంలోని రైతులు రాగిపంటను విస్తారంగా సాగు చేశారు. రైతులు పౌష్టికాహార పంటలను పండించాలని అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. గతంలో సత్యసాయి జిల్లా కలెక్టర్‌గా పనిచేసిన బసంత్‌కుమార్ అప్పట్లో నియోజకవర్గంలో పర్యటించిన సమయంలో రైతులకు పలు సూచనలు చేశారు. పౌష్టికాహారం అందించే పంటలను పండించాలని రైతులను కోరారు. ఈ నేపథ్యంలో మండల పరిధిలోని జమ్మనపల్లికి చెందిన పూజారి రంగప్ప తన పొలంలో రాగి పంటను సాగు చేశారు. దాదాపు ఎకరా పొలంలో రంగప్ప రాగి పంటను సాగు చేయగా చుట్టుప్రక్కల రైతులు తమ పొలాల్లో కూడా దాదాపు 8 నుండి 10 ఎకరాల వరకు రైతులు రాగి పంటను సాగు చేశారు. మూడు నెలల తర్వాత ఆ పంట చేతికి రావడంతో బుధవారం ఆ పంటను కోత కోశారు.

టిడిపి, జనసేనల అడ్రస్ గల్లంతు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి -పెనుకొండ



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

వచ్చే ఎన్నికల్లో టిడిపి, జనసేన పార్టీల అడ్రస్ గల్లంతు అవ్వడం ఖాయమని స్థానిక ఎమ్మెల్యే శంకర్ నారాయణ అన్నారు. బుధవారం పట్టణంలోని భోగసముద్రం చెరువు కట్ట పై రూ.95 లక్షలతో చేపడుతున్న అభివృద్ధి పనుల్లో భాగంగా చెరువును వీక్షించేందుకు వాకింగ్ ట్రాక్ ఏర్పాటు కోసం ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు అరెస్ట్ నేపథ్యంలో న్యాయస్థానాలపై కామెంట్స్ చేసిన టిడిపి నాయకులపై న్యాయస్థానాలు సుమోటోగా కేసులు నమోదు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ ఛైర్మన్ ఫరూక్, వైస్‌ఛైర్మన్లు సునీల్, జయశంకర్ రెడ్డి, కౌన్సిలర్లు, వైసిపి నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ ధర్మవరంగా మారుద్దాం

ప్రజాశక్తి ధర్మవరం టౌన్



రోడ్లను శుభ్రం చేస్తున్న మున్సిపల్ చైర్ పర్సన్, వైస్ చైర్మన్లు, అధికారులు

ధర్మవరాన్ని స్వచ్ఛధర్మవరంగా తీర్చిదిద్దడానికి ప్రజలందరి భాగస్వామ్యం అవసరమని మున్సిపల్ ఛైర్‌పర్సన్‌కాచర్ల లక్ష్మీ, కమిషనర్ బండి శేషన్న పేర్కొన్నారు. స్వచ్ఛతా 'లీగ్ 2.0 అండ్ సఫాయ్ మిత్ర సురక్షశివిర్ ధర్మవరం గ్రీన్ గన్నర్స్ కార్యక్రమంలో భాగంగా బుధవారం చైర్ పర్సన్ తో పాటు వైస్ ఛైర్మన్లు జయరామిరెడ్డి, షేక్ షంషాద్ బేగం, కౌన్సిలర్లు, అధికారులు రోడ్లను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజలు ఇంటిలోని చెత్తాచెదారాన్ని ఎక్కడ పడితే అక్కడ పారవేయకుండా చెత్త ట్రాక్టర్లో వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ ఆనంద్, శానిటరీ ఇన్స్‌పెక్టర్లు మహబూబ్‌బాషా, శ్యామ్సన్, నాయకులు చాంద్‌బాషా, కాచర్ల అంజి, చెలిమి పెద్దన్న తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి అవార్డుకు ఎంపిక

ప్రజాశక్తి - కదిరి టౌన్

కదిరి డిపో నందు కండక్టరుగా పనిచేస్తున్న టి.గంగాప్రసాద్ కుమార్తె టి.గాయిత్రికి ఎపిఎస్ ఆర్టీసీ క్రెడిట్ కోపరేటివ్ సంస్థ నగదు అవార్డు ప్రకటించింది. 2023 సంవత్సరంలో బిఎ పరీక్షలో వెయ్యికి 963 మార్కులు సాధించినందున నగదు అవార్డును ప్రకటించారు. నగదులో పాటు ప్రశంసాపత్రాన్ని ఈనెల 29 న విజయవాడలో మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగే 68వ సిసిఎస్ మహాసభలో సిసిఎస్ చైర్మేన్, ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టరు ద్వారకా తిరుమలరావు చేతులమీదుగా అందుకోనున్నారని కదిరి డిపోమేనేజరు బి.మైనోద్దీన్ తెలిపారు. అవార్డుకు ఎంపికయిన గాయిత్రికి, వారి తల్లితండ్రులకు కదిరి డిపో సిబ్బంది హరిమోహన్, హరిత, రామక్రిష్ణ, బైరిశెట్టి, ఉత్తన్న, రవీంద్ర, శంకరప్ప తదితరులు అభినందించారు.

నేరాలు ఘోరాలు

ఇసుక ట్రాక్టర్ సీజ్

లేపాక్షి : మండలం పరిధిలోని నాగనిపల్లిలో అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు స్థానిక ఎస్ ఐ మునీర్ అహమ్మద్ తెలిపారు. స్థానికులు సమాచారం మేరకు దాడులు నిర్వహించి ఇసుక ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమం లో ఎఎస్ఐ సర్ఫుద్దీన్, సిబ్బంది పాల్గొన్నారు

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు

తనకల్లు : మండల పరిధిలోని కొక్కంటి క్రాస్ లో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో అన్నమయ్య జిల్లాకు చెందిన మహిళకు తీవ్ర గాయాలు అయ్యాయి. అన్నమయ్య జిల్లా ములకలచెరువు మండలం యేసు వారి పల్లి కి చెందిన సుబ్బయ్య, గీత (45), వ్యక్తిగత పనిమీద కొక్కంటికి వెళుతుండగా వేగంగా వచ్చిన లారీ వీరి ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. కిందపడిన మహిళ కాళ్లపై నుండి లారీ వెల్లగా ఆమె ఒక కాలు పూర్తిగా నుజ్జు నుజ్జు అయినది. మరో కాలు పాక్షికంగా దెబ్బతింది. తక్షణమే స్పందించినకొక్కంటి క్రాస్ కు చెందిన వందేమాతరం టీం సభ్యులు బాలకృష్ణ, అశోక్ తమ కారులో మహిళను ఎక్కించుకొని తనకల్లు ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రథమ చికిత్స చేయించిన అనంతరం కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాంభూపాల్‌యాదవ్ చెప్పారు.

కర్నాటక మద్యం స్వాధీనం

గోరంట్ల రూరల్ : కర్నాటక ప్రాంతం నుండి అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకున్నట్లు సిఐ సుబ్బరాయుడు తెలిపారు. బుధవారం ఉదయం 7 గంటల సమయంలో గోరంట్ల మండలం లోని జీనవాండ్లపల్లి గ్రామ శివార్లలో ఎస్.సోమశేఖర్ అనే వ్యక్తి కర్నాటక నుంచి ద్విచక్ర వాహనంలో మద్యం తరలిస్తుండగా అరెస్టు చేసినట్లు చెప్పారు. నిందితుడిపై కేసు నమోదు చేసి పెనుకొండ కోర్టులో హాజరు పరిచినట్లు తెలిపారు.

మృతుని కుటుంబానికి పరామర్శ

తనకల్లు : మండల పరిధిలోని మండ్లి పల్లికి చెందిన కొమ్మిద్ది నరసింహులు (38) బుధ వారం కొక్కంటి క్రాస్ లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మతి చెందిన విషయం తెలుసుకున్న కదిరి మాజీ ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్, మృతుని కుటుంబాన్ని పరామర్శించి 25 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న వయసులోనే నరసింహులు మృతిచెందడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ రెడ్డి శేఖర్ రెడ్డి, మాజీ కన్వీనర్లు శంకర్ నాయుడు, రాజారెడ్డి, నాగభూషణ, పీజీ. మల్లికార్జున, నాగేంద్ర ప్రసాద్, బీసీ సెల్ శంకర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ సమావేశం

ఓబుల దేవర చెరువు : స్థానిక మైనార్టీ షాది మహల్‌లో కాంగ్రెస్‌పార్టీ సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సమావేశానికి సత్య సాయి జిల్లా పుట్టపర్తి నియోజకవర్గం సమన్వయ కార్యకర్త బాలాజీ మనోహర్, సీనియర్ నాయకులు రామాంజనేయులు, నజీర్‌బాషా, వీరనారాయణ, గౌస్ బాషా లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ టిడిపి, బిజెపి, వైసిపి తమ స్వార్థం కోసం ప్రజలను మభ్యపెట్టి రైతాంగాన్ని నిరుద్యోగులకు మోసం చేస్తున్నాయని విమర్శించారు. రాబోవు ఎన్నికల్లో మూడు పార్టీలను గద్దె దింపాలని వారు పిలుపునిచ్చారు.

కోలాహలంగా వినాయక నిమజ్జనం





పుట్టపర్తి, రొద్దంలో వినాయక విగ్రహాల ఊరేగింపు

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

వినాయక నిమజ్జనానికి పట్టణంలోని ఏర్పాటు చేసిన గణనాథులను ప్రజలు కోలాహలంగా తీసుకెళ్లారు. పుట్టపర్తి, గోకులం, ఎనుములపల్లి లో వెలసిన గణనాథులను పట్టణంలో ట్రాక్టర్ల ద్వారా ఊరేగించారు. నిమజ్జనానికి కొన్ని విగ్రహాలను సాహెబ్ చెరువు కు, మరికొన్ని ఎనుములపల్లి చెరువుకు తరలించారు. ఎక్కడ ఎలాంటి సంఘటనలు జరగకుండా సిఐ కొండారెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు పటిష్ట బందోబస్తు చేపట్టారు.

వేలంలో దక్కించుకున్న లడ్డు : గణనాధుల కోసం ఏర్పాటు చేసిన లడ్డును పలువురు వేలంపాట ద్వారా దక్కించుకున్నారు. పట్టణంలోని వివేకనంద రోడ్డులో వెలసిన గణనాధుని కోసం చేసిన లడ్డును బెస్త సాయినాథ్ 70 వేల రూపాయలకు దక్కించుకున్నారు. అలాగే గోపురం నాలుగవ క్రాస్ లో ప్రవీణ్ సాయి 52 వేలకు దక్కించుకున్నాడు.

గాండ్లపెంట : మండల వ్యాప్తంగా ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలను బుధవారం ఘనంగా నిమజ్జనం చేశారు. ఈసందర్భంగా ఇన్‌చార్జి ఎస్ఐ మక్బూల్‌బాషా ఆధ్వర్యంలో పోలీసులు గట్టిభద్రతా చర్యలు చేపట్టారు. మండల వ్యాప్తంగా దాదాపు 50 విగ్రహాలను ప్రతిష్ఠించారని ఎస్ఐ చెప్పారు. వినాయక విగ్రహాల నిమజ్జనం కార్యక్రమంలో వైసీపీ మండల కన్వీనర్ జీ రవీంద్రారెడ్డి, గ్రామసర్పంచులు బి శాంతమ్మ, కళావతి రవీంద్ర నాయక్, ఏపీఎస్ఆర్టీసీడ్రైవర్ రమణ, చలపతి గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు

కొత్తచెరువు : వినాయక విగ్రహాల నిమజ్జనం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. విగ్రహాలను పుట్టపర్తి రోడ్డు మీదుగా బుక్కపట్నం చెరువులో నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వాణి శ్రీనివాసులు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

బత్తలపల్లి : బత్తలపల్లిలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలను బుధవారం నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా చేపట్టిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఇన్‌ఛార్జి ఎస్ఐ ప్రదీప్ కుమార్, ఎఎస్ఐ సోమశేఖర్ తమ సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

ఓబుల దేవర చెరువు : మండల కేంద్రంలోని శివాలయం వద్ద ఏర్పాటు చేసిన వినాయక విగ్రహ మండపానికి ముస్లిం సోదరుడు షేక్ నిజాంవలి లడ్డూను కానుకగా అందించారు. గత 14 ఏళ్ల నుంచి వినాయక చవితి సందర్భంగా వినాయక విగ్రహానికి లడ్డుని కానుక ఇస్తున్నారు. బుధవారం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని మండల కేంద్రానికి చెందిన హోటల్ కిష్ట, టైలర్ రాము , హెడ్ కానిస్టేబుల్ ఎస్ ఎస్ గౌడ్, లక్ష్మి పతి ఆధ్వర్యంలో నిర్వహించారు.

రొద్దం : మండల వ్యాప్తంగా వివిధ గ్రామాలలో బుధవారం వినాయక నిమజ్జనం కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని ఆర్ మరువపల్లి గ్రామంలో బీసీ కాలనీ, మహాత్మా జ్యోతిరావు బాపులే పాఠశాల వద్ద ఏర్పాటు చేసిన విగ్రహాలను నిమజ్జనం చేశారు.

తలుపుల : మండల వ్యాప్తంగా ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలను బుధవారం నిమజ్జనం చేశారు. ఈసందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసులు భద్రతా చర్యలు చేపట్టారు.

గోరంట్ల: మండలంలోని పాలసముద్రం సమీపాన విఆర్ఎం గ్రూప్ అధినేత వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో గ్రేట్ విల్లాస్ లో ఏర్పాటు చేసిన వినాయకుడి విగ్రహ నిమజ్జనాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ప్రతి ఏడాది వినాయక చవితి పండగ పురస్కరించుకొని వి ఆర్ ఎం గ్రూప్ అధినేత వెంకటేశ్వరరావు విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నారు. ఈసందర్భంగా గణేష్ విగ్రహం వద్ద నిలువ ఉంచిన లడ్డూను వేలం వేశారు. రూ.1.19 లక్షలకు రిటైర్డ్ ఉపాధ్యాయుడు కృష్ణారెడ్డి వేలంలో లడ్డూను దక్కించుకున్నాడు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి నరసింహులు గ్రామస్తులు పాల్గొన్నారు

మడకశిర : మండల పరిధిలోని భీమరాయనపల్లిలో బుధవారం వినాయక విగ్రహ నిమజ్జన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.

ఓబుల దేవర చెరువు : మండలంలోని పలు గ్రామాల్లో గణేష్ విగ్రహాల నిమజ్జనాన్ని ఘనంగా నిర్వహించారు. గౌనిపల్లి , తంగేడుకుంట, మద్దకువారిపల్లి, చౌడేపల్లి, నందివారిపల్లి, తదితర గ్రామాల్లో గణేష్ విగ్రహాలను ట్రాక్టర్లో ఉంచి ఊరేగించారు. నిమజ్జనం సందర్భంగా గౌనిపల్లిలో లడ్డు వేల వేలం వేయగా మల్లెల రమేష్ రూ 20, 116లకు, పాడారు శేషయ్య గారి పల్లి తండాలో వేలం పాట నిర్వహించగా రూ. 14 వేలకు శ్రీరామ నాయక్ దక్కించుకున్నారు.

ప్రతిపక్ష పార్టీగా ప్రజాక్షేత్రంలో ఉంటాం

కదిరి టౌన్ : రాష్ట్ర అభివద్ధి కోసం ప్రజల పక్షాన నిలబడుతున్న చంద్రబాబు నాయుడు ను అక్రమంగా అరెస్టు చేసి జైల్లో ఉంచారని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కందికుంట వెంకటప్రసాద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం పట్టణంలోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రతిపక్ష పార్టీగా ప్రజాక్షేత్రంలో ఉంటామన్నారు. ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ఎండగడుతున్నదున వైసిపి ప్రభుత్వం కక్ష గట్టి చంద్రబాబు నాయుడుని అక్రమంగా అరెస్టు చేయించడం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమేనని అన్నారు.

ఇళ్ల పట్టాల పంపిణీ జాప్యంపై కలెక్టర్‌కు ఫిర్యాదు

గోరంట్ల రూరల్ : ఇళ్లపట్టాల పంపిణీలో జరుగుతున్న జాప్యంపై పలువురు బాధితులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. సత్యసాయి జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు ఆధ్వర్యం లో జరిగిన "జగనన్నకు చెబుదాం" కార్యక్రమంలో వైసిపి పట్టణ కన్వీనర్ ధనరెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ సమరసింహారెడ్డి తదితరులు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. గోరంట్ల పంచాయతీ పరిధిలోని నిరుపేద లబ్ధిదారులు 2023 జనవరి నెల లో 90 రోజుల స్కీం ద్వారా ఇళ్ల పట్టాల కొరకు దరఖాస్తు చేయగా అర్హులైన 110 మంది లబ్ధిదారులను ఏప్రిల్ నెలలో ప్రభుత్వం గుర్తించిందన్నారు. గుర్తించిన లబ్ధిదారులకు ఇప్పటివరకు ఇళ్ల పట్టాలు మంజూరు పంపిణీ జరగలేదన్నారు. జగనన్న కాలనీలో ఉన్న ఖాళీ స్థలాలను అర్హులైన లబ్ధిదారులకు పంపిణీ చేయించాలని కోరారు.

నిరసనలు తెలిపితే అరెస్టులా..?



ధర్మవరంలోని నిరసన దీక్షలో పరిటాల శ్రీరామ్, తదితరులు



హిందూపురంలో నిరసన ర్యాలీలో మహిళలు, నాయకులు

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

చంద్రబాబు అరెస్టుకు వ్యతిరేకంగా శాంతియుత నిరసనలు తెలపడానికి వెళుతుంటే నాయకులను ,కార్యకర్తలను అరెస్టు చేయడం న్యాయమా అని మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి ప్రశ్నించారు. ఈ మేరకు ఆయన బుధవారం పుట్టపర్తి మండల పరిధిలోని పైపల్లి గ్రామంలో వినాయకుని విగ్రహం, గ్రామంలోని నిడిమామిడమ్మ దేవాలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిరసనలు ప్రారంభించి నేటికీ ఎనిమిది రోజులు అవుతోందని అన్నారు. శాంతియుత నిరసనలు తెలియజేసే వారిని అదుపులోకి తీసుకోవడం సబబు కాదని, ఈ నిరసనలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయని, ఆంధ్ర ప్రదేశ్ లోనే కాక దేశవ్యాప్తంగా నిరసనలు తెలియజేస్తున్నారని ప్రభుత్వానికి ఇకనైనా బుద్ధి రాలేదని తెలిపారు. మనం ఏ రాజ్యంలో ఉన్నాము అర్థం కాలేదన్నారు. రాష్ట్రంలో రాజారెడ్డి పాలన సాగుతుందని ఇది ఎంతో కాలం సాగదని త్వరలో వైసిపి ప్రభుత్వాన్ని ప్రజలే గద్దె దించుతారని జోస్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ విజయ్ కుమార్, పై పల్లి సర్పంచి ప్రవీణ్ కుమార్, మాజీ సర్పంచులు మురారి, మురళి, తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం టౌన్ : రాష్ట్రంలో అరాచక, రాక్షస పాలన సాగుతోందని నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ విమర్శించారు. చంద్రబాబు అరెస్టుకు వ్యతిరేకంగా తహాశీల్దార్ కార్యాలయం ఎదుట చేపట్టిన రిలేదీక్షలు బుధవారానికి 8వరోజుకు చేరుకున్నాయి. పట్టణ బీసీ సంఘాల నాయకులు బోయరవిచంద్ర, బొట్టుకిష్ణ, సాయి, సంగాల బాలు, మహేశ్, పోతలయ్య, ఆచారి, పూజారి సూరి, మల్లి, బిల్లేశీన, మందలనాగరాజు, శ్రీనివాస ఆచారి, సత్యనారాయణ, సూర్యనారాయణ, తోటవాసుదేవలు రిలే నిరాహారదీక్షలు చేపట్టగా వీరికి పరిటాలశ్రీరామ్ మద్దతు తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు, లోకేష్ చేపట్టే యాత్రలకు ప్రజల నుంచి వస్తున్న ఆదరణ చూసి జగన్ లో వణుకుపుట్టిందన్నారు. వైసీపీ ఎన్ని కుయుక్తులు పన్నిన చివరికి చంద్రబాబు నిర్దోషిగా బయటకు వస్తారన్నారు. కక్షసాధింపుతోనే చంద్రబాబుపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని విమర్శించారు.

చెన్నేకొత్తపల్లి : టిడిపి ప్రభుత్వ హయాంలో రూ.149కే ఫైబర్ నెట్ కనెక్షన్ ఇచ్చి పేద మధ్యతరగతి ప్రజలకు అందుబాటులో ఉంచామని మాజీ మంత్రి పరిటాల సునీత అన్నారు. అదే వైసిపి ప్రభుత్వంలో 350 రూపాయలకు పెంచారని. దీనిని బట్టి ఎవరు అవినీతి చేస్తున్నారో ఎవరు ప్రజలకు మేలు చేస్తున్నారో అర్థమవుతోందని ఆమె అభిప్రాయపడ్డారు. టిడిపి అధినేత చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ మండల కేంద్రంలో తెలుగుదేశం పార్టీ కార్యాలయం వద్ద టీడీపీ బీసీ సెల్ నాయకులు రిలే దీక్షలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి పరిటాల సునీత పాల్గొని వారికి మద్దతు తెలిపారు. అనంతరం కళ్లకు గంతలు కట్టుకొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. చంద్రబాబు అరెస్టుతో తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు ఆత్మస్థైర్యం కోల్పోవద్దని త్వరలోనే చంద్రబాబు బయటికి వస్తారని పరిటాల సునీత చెప్పారు.

ధర్మవరం టౌన్: ఏ తప్పు లేకున్న టీడీపీ అధినేత చంద్రబాబునాయుడును అక్రమంగా అరెస్టు చేయడం అత్యంత దారుణమని మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణ అనుచరులు పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణ ఆదేశాల మేరకు బుధవారం లక్షపోస్టు కార్డుల ఉద్యమానికి శ్రీకారం చుట్టామని వారు చెప్పారు. చంద్రబాబు అరెస్టుకు నిరసనగా కళాజ్యోతిలోని అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేసి అనంతరం పోస్టుకార్డుల ద్వారా నిరసన చేశారు. ఈ కార్యక్రమం గోనుగుంట్ల అనుచరులు - చిగిచెర్ల అరవిందరెడ్డి, తుంపర్తి పరమేష్, నారాయణస్వామి, దేవేంద్రరెడ్డి, చిలకం సూర్యనారాయణరెడ్డి, బోడగల గిరిధర్, దుస్సాక్రిష్ణ, నబీరసూల్, గంధమనేని నారాయణస్వామి, డిజైనర్ రాజా తదితరులు పాల్గొన్నారు.

అగళి : చంద్రబాబును విడుదల చేసేంతవరకు తమ నిరసన కొనసాగిస్తామని టిడిపి మండల నాయకులు అన్నారు. చంద్రబాబు అరెస్టుకు వ్యతిరేకంగా మండల కేంద్రంలో జరిగిన రిలే నిరాహారదీక్షలో మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కక్షసాధింపు చర్యల్లో భాగంగానే చంద్రబాబును అరెస్టు చేశారని విర్శించారు. ఎంతోమంది నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తే ఈ సైకో ప్రభుత్వం అక్రమంగా కేసులు పెట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ ఉమేష్, మండల కన్వీనర్ కుమార్ స్వామి, క్లస్టర్ ఇన్‌ఛార్జి శివకుమార్, కోడిపల్లి సర్పంచి నరసింహమూర్తి, ఎంపీటీసీ చంద్రప్ప, నాగోజి తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తి క్రైమ్ : చంద్రబాబు అరెస్టుకు వ్యతిరేకంగా పుట్టపర్తి పట్టణంలోని టిడిపి పార్టీ కార్యాలయంలో బుధవారం 8వ రోజు రిలే నిరాహార దీక్షలు కొనసాగాయి. మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి ఆదేశాలతో ఈ కార్యక్రమానికి ఇన్‌ఛార్జిగా వచ్చిన బచ్చల పుల్లయ్య అధ్యక్షతన టిడిపి పార్టీ బీసీ సాధికార సభ్యులు పుట్టపర్తి టిడిపి పార్టీ కార్యాలయంలో రిలే నిరాహార దీక్ష కొనసాగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, చంద్రబాబు విడుదల అయ్యేంతవరకు తమ పోరాటం కొనసాగిస్తూనే ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ కన్వీనర్ రామాంజనేయులు, టిడిపి జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, మైనార్టీ నాయకులు మహమ్మద్ రఫీ, నాయకులు శ్రీరామ్ రెడ్డి, నీళ్ల రమణ, బేకరీ నాయుడు, ప్రసాద్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం : చంద్రబాబు నాయుడి అరెస్టుకు వ్యతిరేకంగా పట్టణంలో బుధవారం తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున మహిళలు భారీ నిరసన ప్రదర్శన చేపట్టారు. ఎంజిఎం పాఠశాల మైదానం నుంచి పుర విధుల గుండా ఎన్టీఆర్ సర్కిల్ వరకు ప్రదర్శన ర్యాలీ చేపట్టారు. జగన్మోహన్ రెడ్డి ఇప్పటికైనా ఇలాంటి కుతంత్రాలను విడనాడి ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలకు సిద్ధం కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టిడిపి కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, జిల్లా టిడిపి ప్రధాన కార్యదర్శి అంబికా లక్ష్మీనారాయణ, మాజీ మున్సిపల్ ఛైర్మన్ జేవి అనిల్ కుమార్, నాయకులు కొల్లగుంట అంజనప్ప, డిఇ రమేష్ కుమార్, అమర్నాథ్, మహిళా నేతలు సుబ్బరత్నమ్మ, పరిమళ, రామాంజనమ్మ తదితరులు పాల్గొన్నారు.